క్లుప్తంగా

నేడు న్యాయమూర్తులకు వీడ్కోలు సమావేశం

వరంగల్ లీగల్: బదిలీపై వెళ్తున్న వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.రాధాదేవి, వరంగల్ జిల్లా కోఆపరేటివ్ ట్రిబ్యునల్ చైర్మన్ జడ్జి వై.సత్యేంద్రకు వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించనున్నట్లు వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జీవన్‌గౌడ్, మహమ్మద్ ముదస్సిర్ ఖయ్యూమి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ల నాయకులు, న్యాయవాదులు, అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రామా ఆర్యకు కారుణ్య నియామకం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఈఏడాది జనవరి 11న మరణించిన రామా వేణుగోపాల్ కుమారుడు రామా ఆర్యకు కారుణ్య నియామకం కింద వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు రామా ఆర్యకు అకడమిక్ బ్రాంచ్‌లో క్లర్క్ కమ్ టైపిస్టుగా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులను సోమవారం అందజేశారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి



కాజీపేట: రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించడానికి కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కార్పొరేటర్ ఎలకంటి రాములు సూచించారు. కాజీపేట 61వ డివిజన్ వడ్డేపల్లి ట్యాంక్‌బండ్‌పై పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో ఎండి గౌస్‌పాషా, లక్ష్మణ్, తిరుపతి, కిశోర్, అభినవ్, మనోహర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని ఆదరించాలి



కాశిబుగ్గ: బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఎం.సుధీర్‌కుమార్‌ను ఆదరించి గెలిపించాలని 35వ డివిజన్ కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ కోరారు. సుధీర్‌కుమార్ నామినేషన్‌కు డివిజన్ నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు సోమవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఏసిరెడ్డినగర్‌లో కార్పొరేటర్ ప్రవీణ్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో అప్పిగట్ల చిరంజీవి, అనుమాండ్ల నగేష్, పాలిశెట్టి సుధీర్, రాగి బ్రహ్మచారి, కిరణ్, పురెల్ల సతీష్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



మడికొండ: బీజేపీ, బీఆర్ఎస్ నుంచి పలువురు స్థానిక నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈమేరకు వారికి క్యాంపు కార్యాలయంలో కండువాలు కప్పి పార్టీలోకి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సోమవారం ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గడ్డం ఆనంద్‌బాబు, గడ్డం శ్రీనివాస్, సుధాకర్, వస్కుల సంజీవ, మాణిక్యం, బస్కే సారంగపాణి, గడ్డం రవీందర్, మునిగాల సరళ, జయలక్ష్మి, సుగుణమ్మ, తాడురి మోహన్, మాజీ వైస్ ఎంపీపీ బిల్లా రవీందర్, శివ, నాగరాజు, వస్కుల శ్రీనివాస్, మల్లికార్జున్, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల ఓటరు ప్రతిజ్ఞ



విద్యారణ్యపురి: 'మేము ఓటేస్తాం.. మా విద్యార్థుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతోనూ పార్లమెంటు ఎన్నికల్లో ఓటు వేయిస్తా' అంటూ హనుమకొండలోని నక్కలగుట్టలోని వివేకానంద పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఈమేరకు విద్యార్థులతో కలిసి ఓటరు ప్రతిజ్ఞచేశారు. ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ నగరంలో చేస్తున్న ఓటరు చైతన్య కార్యక్రమం.. నక్కలగుట్టలోని వివేకానంద పాఠశాలలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పాక వెంకటేశ్వర్లు అధ్యక్షతన సోమవారం జరిగింది. కార్యక్రమంలో వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ పాక వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాక పద్మ, అనిత, షబానాభాను, శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక పాలన' అస్తవ్యస్తం

- అందుబాటులో ఉండని ప్రత్యేక అధికారులు
- విధులకు డుమ్మా కొడుతున్న పంచాయతీ సెక్రటరీలు
- గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు
- అధ్వానంగా మురుగునీటి కాల్వలు
- వెలగని వీధి దీపాలు



గ్రామపంచాయతీ కార్యాలయం



మూలనపడ్డ ట్రాక్టర్



వెలగని విద్యుత్ దీపాలు

హసన్‌పర్తి: గ్రామాల్లో స్పెషల్ అధికారుల పాలన అస్తవ్యస్తంగా మారింది. ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీ నుంచి గ్రామాల్లో ప్రత్యేక అధికారులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, గ్రామాల్లోకి వెళ్లి బాధ్యతలు చేపట్టిన కొంత మంది ప్రత్యేక అధికారులు.. ఆ తర్వాత ఊళ్లల్లోకి వచ్చిన సందర్భాలు లేవని స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 208 గ్రామపంచాయతీలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో పరిస్థితి దారుణంగా మారింది.

విధులకు డుమ్మా!

కొన్ని గ్రామపంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల జాడే లేదు. పంచాయతీ కార్యదర్శులు విధులకు డుమ్మ కొడుతున్నారు. కొంతమంది వారానికి ఒకరోజు మాత్రమే హాజరవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పంచాయతీ కార్యదర్శులపై అజమాయిషీ లేకపోవడమే అందుకు కారణంగా పేర్కొంటున్నారు. పాలకవర్గం ఉన్నప్పుడు సక్రమంగా విధులకు హాజరయ్యే అధికారులు.. ఇప్పుడు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి

స్పెషల్ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో గ్రామ పంచాయతీల్లో నీటి ఎద్దడి నెలకొంది. కొన్ని గ్రామాల్లో పైపులైన్ల లీకేజీల కారణంగా సగం వరకు నీరు వృథా అవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని పంచాయతీల్లో పంపు ఆపరేటర్లు పనిచేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నీటి సరఫరా కోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్లు కూడా మూలన పడ్డాయని చెబుతున్నారు.

అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ

ఆయా పంచాయతీల్లో మురుగునీటి కాల్వల పరిస్థితి అధ్వానంగా మారింది. పర్యవేక్షణ లేకపోవడమే ముఖ్య కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వస్తోందని వాపోతున్నారు. చెత్తను తరలించడానికి ఖరీదు చేసిన ట్రాక్టర్లు వారానికి రెండు రోజుల మాత్రమే షెడ్ నుంచి బయటికి వస్తున్నాయని అంటున్నారు. దోమల వ్యాప్తితో రాత్రీపగలు కంటి మీద కునుకు లేకుండా పోతోందని వాపోతున్నారు.

అంధకారంలో గ్రామాలు

కొన్ని గ్రామాల్లో వీధి లైట్లు వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు. రాత్రివేళ గ్రామం అంధకారంలో కూరుకుపోతోందని చెప్పారు. చీకటిలో బయటికి వెళ్లడానికి ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. విష పురుగుల బెడద పొంచి ఉందని పలువురు అంటున్నారు.

అందుబాటులో ఉండని ప్రత్యేక అధికారులు

ప్రత్యేక అధికారులు స్థానికంగా అందుబాటులో ఉండకపోవడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. బాధ్యతలు చేపట్టి రెండు నెలల గడుస్తున్నా గ్రామానికి స్పెషల్ ఆఫీసర్ ఎవరో తెలియని దుస్థితి నెలకొంది. అయితే జీపీ కార్యదర్శుల వద్దకు సమస్యను తీసుకెళ్లినా వారు మాత్రం ప్రత్యేక అధికారుల పేరు చెబుతూ తప్పుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



పేరుకుపోయిన చెత్తాచెదారం



కంపుకొడుతున్న మురుగునీటి కాల్వ



కలుషితమవుతున్న తాగునీరు

రంగంపేట పురాతన మసీదులో అవినీతి



మాట్లాడుతున్న రంగంపేట బస్తీవాసులు

హన్మకొండ: వరంగల్ రంగంపేట మసీదులో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని బస్తీవాసులు కోరారు. హనుమకొండలోని ప్రెస్ క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో బస్తీవాసులు మహమ్మద్ ఖలీల్ అహ్మద్, ఖాజాపాషా, ఇమ్రాన్ పాషా, మీర్ ఇంతియాజ్ అలీతో పలువురు ముస్లిం పెద్దలు మాట్లాడారు. పాత సెంట్రల్ జైల్ ఎదురుగా ఉన్న మసీదుకు చెందిన కమిటీ గడువు సమయం ముగిసినా వారికి వారే బాధ్యులుగా చలామణి అవుతూ అమాయక బస్తీ ప్రజలను మోసం చేస్తూ మజీదు నిర్వహణ, నిర్మాణం పేరుతో రూ.లక్షల్లో వసూళ్లు చేస్తూ దొంగ రశీదు బుక్కులు పెట్టి కాజేస్తున్నారని ఆరోపించారు. వారి బండారాన్ని బయటపెట్టి వక్ఫ్‌బోర్డు అధికారులకు ఫిర్యాదు చేసినా అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా అవినీతికి పాల్పడుతున్న కమిటీకి అండగా నిలిచారని వాపోయారు. మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో సాక్ష్యాలతో ఫిర్యాదు చేసినా పోలీసులు కూడా పట్టించుకోలేదని, తమ ఫిర్యాదును పక్కన పడేశారని ధ్వజమెత్తారు. కలెక్టర్, సీపీ స్పందించి తగు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బస్తీవాసులు గౌస్, ఇక్బాల్ పాషా, మహమ్మద్ అలీ, ఎస్‌కే.శాబుద్దీన్, అబ్దుల్ మసూద్, మహమ్మద్ హాగీ, ఫాజిల్ హసన్, ఎస్‌కే.ముస్తాక్, ఎండీ.ఇమ్తియాజ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

హన్మకొండ: మనువాద ఫాసిజానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆధ్వర్యంలో ఈనెల 28న జరగనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ బి.రమాదేవి పిలుపునిచ్చారు. రాష్ట్ర సదస్సు కరపత్రాలను హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద తెలంగాణ ప్రజాఫ్రంట్, ప్రజా సంఘాల నాయకులు సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఈనెల 28న మధ్యాహ్నం హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో సదస్సు జరుగుతుందని వివరించారు. టీపీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రాచమోని నాగభూషణ్ అధ్యక్షతన జరగనున్న సదస్సులో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రొఫెసర్ చింతకింది ఖాసీం, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, టీపీఎఫ్ రాష్ట్ర కోకన్వీనర్ ఎ.నరసింహారెడ్డి ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో భారత్ బచావో నాయకుడు వెంగల్ రెడ్డి, చైతన్య మహిళా సమాఖ్య నాయకురాలు కళ, టీపీ జేఏసీ కోకన్వీనర్ ప్రవీణ్, టీపీఎఫ్ నాయకుడు గద్దల సంజీవ, పౌర హక్కుల సంఘం నాయకులు జయంత్, సదానందం, సుదర్శన్ రెడ్డి, శ్యామ్ పాల్గొన్నారు.

చైల్డ్‌లైన్‌కు బాలిక అప్పగింత



చైల్డ్‌లైన్‌కు అప్పగిస్తున్న ఆర్పీఎఫ్ కానిస్టేబుల్

కాజీపేట రూరల్: 17 ఏళ్ల బాలికను 1098 చైల్డ్‌లైన్ సిబ్బందికి కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) పోలీసులు సోమవారం అప్పగించారు. కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ ఎం.సంజీవరావు తెలిపిన వివరాల ప్రకారం కాజీపేట, సికింద్రాబాద్ ఆర్పిఎఫ్ బృందం చేపట్టిన ఆపరేషన్ నన్హె ఫరిస్తే (బాలుర రక్షణ)లో భాగంగా సికింద్రాబాద్ - ధానాపూర్ (12791) వెళ్లే ధానాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన బాలిక ఒంటరిగా, టికెట్ లేకుండా ప్రయాణిస్తున్నట్లు టీటీఈ, రైల్వే స్టాఫ్, ప్రయాణికులు గుర్తించి ఆర్పీఎఫ్ అధికారులకు సమాచారం అందించారు. దాంతో కాజీపేటలో హెడ్ కానిస్టేబుల్ వి.వెంకట్, కానిస్టేబుల్ ప్రియాంకను అప్రమత్తం చేసి కాజీపేట జంక్షన్‌కు రైలు రాగానే ఆ బాలికను అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తీసుకెళ్లి వివరాలు అడిగి కౌన్సెలింగ్ చేసి 1098 వారికి అప్పగించినట్లు సీఐ తెలిపారు.

108 సిబ్బందికి 'ఉత్తమ అవార్డు' ప్రదానం



ఖిలా వరంగల్: అవార్డు అందుకుంటున్న సిబ్బంది

ఖిలా వరంగల్: వరంగల్ మామునూరు పోలీస్ స్టేషన్ పరిధి నక్కలపెల్లిలో జరిగిన రోడ్డ ప్రమాదంలో క్షతగాత్రులను తక్షణమే స్పందించి కాపాడిన వరంగల్ ఉర్సు కరీమాబాద్ 108 అంబులెన్స్ మెడికల్ టెక్నీషన్ క్రాంతికుమార్, పైలట్ చంద్రసేనాకు లైఫ్ సేవియర్ అవార్డును ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ హైదరాబాద్ డెరెక్టర్ డాక్టర్ వెంకటేశం ప్రకటించారు. ఈమేరకు హైదరాబాద్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో వారికి డైరెక్టర్ డాక్టర్ వెంకటేశంతో పాటు రాష్ట్ర హెడ్ ఆపరేషన్ ఖలీద్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్, ఎగ్జిక్యూటివ్ రామ్ అవార్డును అందజేశారు.

పరకాల 108 సిబ్బందికి..

హన్మకొండ అర్బన్: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 108 ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసు సంస్థ 2023 -24వ సంవత్సరానికి ఉత్తమ సేవా పతకానికి హనుమకొండ జిల్లా పరకాల సిబ్బంది ఎంపికయ్యారు. గత నవంబర్‌లో కంఠాత్మకూర్‌కు చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా ప్రాథమిక చికిత్స చేసి ప్రాణాపాయ స్థితి నుంచి 108 సిబ్బంది కాపాడారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ వక్కల సంజీవ్, పైలెట్ పాముల రాజు.. విధి నిర్వహణలో చూపిన చాకచక్యంతో బాధిత వ్యక్తి బతికి బయట పడ్డాడు. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్, రాష్ట్ర ఆపరేషన్ హెడ్ ఖలీద్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డును సంజీవ, రాజు అందుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ పాల్గొన్నారు.

సీపీఐ (ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవం



వరంగల్: మార్క్సిస్ట్ మహా ఉద్యమ నాయకుడు కామ్రేడ్ లెనిన్ 154వ జయంతితో పాటు సీపీఐ (ఎంఎల్) 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని వరంగల్ ఎల్‌బీనగర్‌లోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను నాయకుడు ఆరెల్లి కృష్ణ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా పేదలందరూ సంఘటితమై ఉద్యమాలు నిర్వహించాలని సూచించారు. కొన్ని పెట్టుబడిదారి శక్తులు మీడియాను అదుపులో పెట్టుకుని కమ్యూనిజానికి కాలం చెల్లిందని గ్లోబెల్స్ ప్రచారం చేస్తున్నాయని, అదంతా ఒట్టి బూటకం అని కొట్టిపారేశారు. ఎన్నికల హామీలను కేంద్రంలోని మోదీ తుంగలో తొక్కిందని విమర్శించారు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయాలని ఆయన కోరారు. నాయకుడు నున్న అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మొగిలి వెంకటరెడ్డి, మహేష్, ముషారఫ్, సమీర్, అజిత్, నరసింహ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పడమర కోట జంక్షన్‌లో..

ఖిలా వరంగల్: పడమరకోట జంక్షన్‌లో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు రాచర్ల బాలరాజు ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జిల్లా నేత బండి కోటేశ్వరరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర పూర్వ ఉపాధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్ హాజరై జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మిక చట్టాలను సవరించి దోపిడీ వర్గాల ఏజెంట్‌గా మోదీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో పీవైఎల్ నేత గంధ్రాతి హరిబాబు, ఇనుముల కృష్ణ, వీరన్న, గద్దల ప్రభాకర్, రాజు, అక్బర్, బండి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

'భద్రకాళి'లో కావ్య పూజలు



హన్మకొండ కల్చరల్: కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య భద్రకాళి దేవాలయాన్ని సోమవారం సందర్శించి పూజలు నిర్వహించారు. తొలి సెట్ నామినేషన్ దాఖలు చేయడానికి ముందు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే, భద్రకాళి దేవాలయం పక్కన ఉన్న సాయిబాబా మందిరంలోనూ పూజలు చేశారు. కావ్య వెంట ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో వారసత్వ రాజకీయాలు

హన్మకొండ: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలో వారసత్వ రాజకీయాలకు పునాదులు పడ్డాయని వరంగల్ లోక్‌సభ స్వతంత్ర అభ్యర్థి ఎస్‌పీకే.సాగర్ అన్నారు. హనుమకొండలోని ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను టీడీపీ నుంచి 2017లో కాంగ్రెస్‌లోకి వచ్చానని, అప్పటి నుంచి పార్టీలో ముఖ్య కార్యకర్తగా పనిచేస్తూ రేవంత్‌రెడ్డి వెంట నడుస్తున్నానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రాజకీయ వారసత్వాలను ప్రోత్సహిస్తూ మైనంపల్లి హనుమంత రావు కుమారుడు మైనంపల్లి రోహిత్ రావు, జానారెడ్డి కుమారుడు, వివేక్ వెంకటస్వామి కుమారుడికి రాజకీయ అవకాశాలు కల్పించినట్లు విమర్శించారు. ఈక్రమంలో వరంగల్ నుంచి కడియం కావ్యకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చినందుకు నిరసనగా ఆమెను ఓడించేందుకు తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో నిలబడ్డానని చెప్పారు. ఈ సమావేశంలో ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక, ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ సభ్యులు, అధికారులు



ఖిలా వరంగల్: సమావేశంలో మాట్లాడుతున్న పరశురాములు

కాశిబుగ్గ: పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత అని హనుమకొండ జిల్లా డీఆర్‌ఓ వైవీ.గణేష్ అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక, ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ హార్టికల్చర్ ఆధ్వర్యంలో వేయి మొక్కలు నాటాలనే లక్ష్యంతో నగరంలోని ఈఎస్ఐ ఆస్పత్రిలో సోమవారం 100 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ గణేష్, జీడబ్ల్యూఎంసీ హార్టికల్చర్ అధికారి రమేష్ మాట్లాడుతూ ప్రకృతి కన్నతల్లి లాంటిదని, దాన్ని కాపాడుకోవడం సామాజిక బాధ్యత అని గుర్తుచేశారు. పర్యావరణాన్ని రక్షించుకుంటేనే భావితరాలకు మనుగడ ఉంటుందని చెప్పారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటాలని ప్రతిజ్ఞ చేసి కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ క్రాంతిసాగర్, జిల్లా సహాయ ట్రెజరీ అధికారి అన్వర్, ఐక్యవేదిక అధ్యక్షులు పురుషోత్తం, శ్రవణ్‌కుమార్, సోషల్ వర్కర్ రామస్వామి, హార్టికల్చర్ అధికారులు ప్రిన్సిమేడం, శాంతారాం కర్ణ, వెంకటేశ్వర్లు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రంలో అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సామాజికవేత్త మండల పరశురాములు హాజరై మాట్లాడుతూ నేడు కృత్రిమ ఎరువుల కారణంగా భూమి కలుషితమవుతోందని వాపోయారు. రైతులు సేంద్రియ ఎరువులు వాడి అధిక దిగుబడులు వచ్చేవిధంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ దూరంగా ఉంటూ జీవించాలని సూచించారు.

బీఆర్ఎస్, బీజేపీ నాయకులు క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను అమలు చేయకుండా పదేళ్ల రాష్ట్ర ప్రజలను మోసం చేసిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు క్షమాపణ చెప్పాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణకు మద్దతు ఇచ్చామని చెప్పుకుంటున్న బీజేపీ.. విభజన హామీలను ఎందుకు అమలు చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఉద్యమ సమయంలో ఫాంహౌజ్‌లో కేసీఆర్ పడుకున్నారని, సోనియాగాంధీ త్యాగనిరతితో రాష్ట్రాన్ని ఇచ్చారని అన్నారు. కాజీపేట నుంచి రైల్వే క్రూలింక్ తరలిపోతుంటే ఒక్కరూ మాట్లాడని బీజేపీ నాయకులు.. ఇప్పుడు మోదీ జపంతో ఓట్లడగడం బాధాకరమని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను దత్తత తీసుకోవాలని ఈనెల 24న జరగనున్న జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతామని చెప్పారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ రాహుల్‌గాంధీతోనే రామరాజ్యం సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు స్వర్ణ, డాక్టర్ పులి అనిల్, కూచన రవళి పాల్గొన్నారు.

కేటీఆర్ సభకు తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న లలితాయాదవ్

వరంగల్: వర్ధన్నపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పాల్గొంటున్న సభను విజయవంతం చేయాలని రైతు సమన్వయ సమితి జిల్లా సమన్వయకర్త ఎల్లావుల లలితాయాదవ్ కోరారు. 14వ డివిజన్ ఎస్ఆర్ నగర్‌లో సోమవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. 14వ డివిజన్‌కు చెందిన గంధం గోవిందుతో పాటు పలువురు నాయకులు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరగా తిరిగి వారు మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ నేతృత్వంలో మళ్లీ బీఆర్ఎస్‌లో సోమవారం చేరారు. కార్యక్రమంలో చింతల యాదగిరి, కేతిరి రాజశేఖర్, మూడవ డివిజన్ అధ్యక్షుడు రాజు, పత్రి రాజపోషాలు, పస్తం యాదగిరి, కొంగర సుదర్శన్, పస్తం రాజేష్, యాదగిరి, విజయ, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు



మాట్లాడుతున్న అఖిల్‌పాషా

హన్మకొండ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి మతిభ్రమించిందని, ఎన్నికల ప్రచార సభల్లో హిందూ, ముస్లింల మధ్య వైషమ్యాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని తెలంగాణ మైనారిటీ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అఖిల్‌పాషా విమర్శించారు. హనుమకొండ సుబేదారిలోని సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజస్థాన్‌లో జరిగిన ప్రచార సభలో నరేంద్ర మోదీ మాట్లాడుతూ కాంగ్రెస్ గెలిస్తే సంపదను ముస్లింలకు పంచేస్తుందని హిందువులను రెచ్చగొడుతూ, మరోసారి తానే ప్రధాన మంత్రి కావాలని కలలు కంటున్నారని దుయ్యబట్టారు. పదేళ్లుగా ప్రధానమంత్రిగా ఉండి దేశప్రజలకు చేసిందేమీ లేక మత రాజకీయాలు చేస్తూ రామమందిరం నిర్మించానని, కృష్ణుడి మందిరం నిర్మిస్తానంటూ దేశాన్ని మనుధర్మం వైపు తీసుకెళ్తున్నారని తూర్పారబట్టారు. ఓటర్లపై ఇండియా కూటమి మేనిఫెస్టో ప్రభావం చూపడంతో మోదీకి ఓటమి భయం పట్టుకుందని అన్నారు. సమావేశంలో తెలంగాణ మైనారిటీ సంక్షేమ సమాఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రష్యా విప్లవ నేత లెనిన్‌కు నివాళి



న్యూశాయంపేట: లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



శివనగర్‌లో..

న్యూశాయంపేట: పేదరికం, మతం, జాతి, వర్ణ అసమానతలు లేని దోపిడీ రహిత సమాజం కోసం పరితపించిన వ్యక్తి, కమ్యూనిస్టు ప్రపంచ మహానేత లెనిన్ అని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కొనియాడారు. రష్యా విప్లవ నేత లెనిన్ వర్ధంతి కార్యక్రమాన్ని బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రహమాన్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బాషబోయిన సంతోష్, వేల్పుల చరణ్, శ్రీపతి, వినయ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

లెనిన్‌కు ఘన నివాళి

ఖిలా వరంగల్: సోషలిస్ట్ విప్లవ సారథి లెనిన్ 154వ జయంతి సందర్భంగా వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో సీపీఐ నగర కమిటీ ఆధ్వర్యంలో లెనిన్ జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేకల రవి, గన్నారపు రమేష్, ల్యాదల్ల శరత్, సుధీర్, యాకూబ్, వెంకట్రాది పాల్గొన్నారు.